క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

వేమూరు: విద్యుత్ లైన్ల శుభ్రతలో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ పి గోపి గురు వారం ఒక ప్రకటనలో తెలిపారు. వేమూరు మండల కేంద్రంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

9న మెగా లోక్ అదాలత్

రేపల్లె రూరల్: పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించేందుకు న్యాయశాఖ నిర్వహిస్తున్న మెగా లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కారమై కక్షిదారులకు న్యాయం జరిగేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు చెప్పారు. స్థానిక కోర్టుభవన్‌లో గురువారం పోలీసు అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 9న శనివారం మెగా లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో పోలీసు అధికారులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ప్రసాద్

భట్టిప్రోలు: వేమూరు నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా పల్లెకోన మాజీ సర్పంచ్ రాయన ప్రసాద్ నియమితులయ్యారు. గురువారం నియామకపు పత్రాన్ని భట్టిప్రోలు మండలం ఐలవరంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బాపట్ల రవి కుమార్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జొన్నాదుల వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఈడే శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షులు మద్దిబోయిన తాతయ్యలు పాల్గొన్నారు. ప్రసాద్ నియామకం పట్ల బీసీ నాయకులు యరగళ్ల సాంబశివరావు, కూరపాటి రఘురామయ్య, జొన్నాదుల రమేష్‌లు హర్షం వ్యక్తం చేశారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ శిబిరానికి స్పందన

చుండూరు(భట్టిప్రోలు): చుండూరు మండలం చినపరిమిలోని హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణవేణి శిబిరంలో 281 మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. బీపీ, షుగర్ వ్యాధి గ్రస్తులు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు వైద్యం అందించారు. శిబిరంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాజిక ఆరోగ్య కేంద్రం సందర్శన



వేమూరు: సామాజిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం త్వరతగతిన పూర్తి చేయాలని ఎంపీపీ యల్లమాటి మోహన్ ఆదేశించారు. వేమూరు మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాజిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం కోసం ప్రభుత్వం రూ .8 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. భవన నిర్మాణం త్వరగా పూర్తి చేసి అప్పగించాలని నిర్మాణ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి హరిణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యేసుక్రీస్తు చూపిన బాటలో పయనిద్దాం

తెనాలిఅర్బన్: యేసు క్రీస్తు చూపిన బాటలో అంతా నడవాలని రక్షణ సైన్యం సంస్థ ప్రతినిధి మేజర్ వి యేసుపాదం పేర్కొన్నారు. రక్షణ సైన్యం చర్చి నాల్గవ వార్షికోత్సవ వేడుకలను అయితానగర్‌లోని చర్చి ఆవరణలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రక్షణ సైన్యం సంస్థ ద్వారా భారత దేశంలోని అనేక ప్రాంతాలలో దేవుని సేవ చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఆయనను సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు. తదనంతరం సంఘస్తులకు ప్రేమ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మేజర్ పి నాగరాజు, సంఘ కాపరి మేజర్ పి రత్న సుందరి, సంఘ పెద్దలు బట్టు జక్రయ్య, గాలి రవి, పిల్లి కనకరత్నం, కారుమంచి నరసింహారావు, రుద్రపాటి ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలను పూర్తిస్థాయిలో భర్తీ చేయాలి

తెనాలి అర్బన్: రైల్వేలో లక్షలాది ఉద్యోగాలు ఖాళీగా ఉంటే కేవలం 5,696 ఉద్యోగాలకు మాత్రమే నోటిఫికేషన్‌ను కేంద్రం విడుదల చేయటం బాధాకరమని రివల్యూషనరీ యూత్ అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆర్‌వైఏ ఆధ్వర్యంలో గురువారం గాంధీ చౌక్‌లో కొద్దిసేపు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని అన్ని శాఖలలో పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్‌వైఏ జాతీయ కమిటీ సభ్యులు ఉదయ్ కిరణ్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలకు కేంద్రంగా బాపట్ల

- ఎమ్మెల్యే కోన రఘుపతి
- రూ.3.50 కోట్లతో ప్రభుత్వ ఆసుపత్రిలో అధునాతన వైద్యసేవలు



ఆసుపత్రి ఆధునికీకరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి, వైద్యులు

బాపట్ల: మెరుగైన వైద్య సేవలకు కేంద్రంగా బాపట్లను అభివృద్ధి చేసేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. బాపట్లలో రూ.3.50 కోట్లతో ఏర్పాటు చేసిన రక్తనిధి విభాగం, వార్డులు, శస్త్రచికిత్సల విభాగం, చిన్నపిల్లలకు వైద్యసేవలు అందించేందుకు ప్రత్యేక విభాగం, మార్చురీ విభాగాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే రఘుపతి మాట్లాడుతూ విద్యారంగంలో అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న బాపట్లను వైద్యరంగంలో సైతం ముందుకు తీసుకుపోయేందుకు సిద్ధమౌతున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని బాపట్లకు 100 పడకల ఆసుపత్రిని మంజూరు చేయాలని కోరితే ఏకంగా వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాలలను మంజూరు చేయటంతో పాటు ఆసుపత్రిని 100 పడకలుగా చేశారని గుర్తు చేశారు. 2025-26 విద్యా సంవత్సరం నుంచి వైద్య కళాశాల అందుబాటులోకి వచ్చే విధంగా పనులు జరుగుతున్నాయని చెప్పారు.బాపట్ల ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. బాపట్లను జిల్లా కేంద్రంగా చేసుకోవటంతో ప్రైవేటు ఆసుపత్రుల సంఖ్య సైతం గణనీయంగా పెరుగుతున్నాయని చెప్పారు. బాపట్ల ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించటమే లక్ష్యంగా ముందుకుపోతున్నామని తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టరు సిద్ధార్థ, డాక్టరు రసూల్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు కాగిత యాజ్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ నివేశన స్థలాలు

బాపట్ల: రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వారందరికీ నివేశన స్థలాలు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. బాపట్ల మండలంలోని నరసాయపాలెం గ్రామ పరిధిలోని ఆది ఆంధ్రా సొసైటీకి చెందిన 54.51 ఎకరాల్లో 110 మంది లబ్ధిదారులకు, మూలపాలెంకు చెందిన నాలుగు ఎకరాల్లో 97 మందికి గురువారం పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడారు. ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా రాష్ట్ర వ్యాప్తంగా 32 లక్షల మందికి జగనన్న కాలనీల ద్వారా నివేశన స్థలాలు అందించటం జరిగిందన్నారు. నరసాయపాలెంలో ఆది ఆంధ్ర సొసైటీకి సంబంధించిన లబ్ధిదారులకు శాశ్వత హక్కు పత్రాలను అందివ్వటం సంతోషంగా ఉందన్నారు. నవరత్నాల్లో భాగంగా ప్రతి ఒక్కరికీ నివేశన స్థలాలతో పాటు పక్కా ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రవీంద్రబాబు, తహసీల్దార్ చిన్నం సుధారాణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, సర్పంచ్‌లు దాసి సుదర్శనబాబు, బి.అనిల్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు దేవరపల్లి నాని, నాయకులు ఆట్ల ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రఘుపతి, ఆర్డీవో రవీంద్రబాబు

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీ లోకి చేరికలు

పార్టీలోకి ఆహ్వానించిన నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి

చెరుకుపల్లి: నిజాంపట్నం మండలం బొర్రావారి పాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. చెరుకుపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో గురువారం పార్టీ కండువాలను కప్పి టీడీపీ నాయకులను వైఎస్సార్ సీపీలోకి డాక్టర్ గణేష్ ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉండటాన్ని గమనించిన పలువురు వైఎస్సార్‌సీపీలోకి చేరేందుకు ఉత్సాహ పడుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారు పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో బొర్రా పరమాత్మ, బొర్రా వెంకటస్వామి, బొర్రా శేషయ్య, విచారపు కోటేశ్వరరావు, బొర్రా బ్రహ్మం, బొర్రా నరసింహారావు తదితరలు ఉన్నారు.

గుడి నిర్మాణానికి ఆర్థికసాయం అందజేత

నిజాంపట్నం మండలం బొర్రావారిపాలెం పంచాయతీలో నిర్మించనున్న మానాటి వీరుడు ఆలయ నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వకర్త డాక్టర్ ఈవూరి గణేష్ తనవంతు ఆర్థిక సాయం అందించారు. గ్రామ పెద్దలకు రూ.1లక్ష అందజేశారు.



వైఎస్సార్‌సీపీలో చేరినవారితో డాక్టర్ ఈవూరి



ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఈవూరి గణేష్

సంక్షేమ సారథి జగనన్నకు అండగా నిలుద్దాం

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్

చెరుకుపల్లి: సంక్షేమ పథకాల సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరచాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ కోరారు. సిద్ధం కార్యక్రమంలో భాగంగా మండలంలోని నడింపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. పేద, బడుగు, బలహీన వర్గాల ఆర్థిక స్థితిగతులు మెరుగవ్వాలంటే మరోమారు జగనన్న ముఖ్యమంత్రి కావాలన్నారు. సంక్షేమ పథకాలను దిగ్విజయంగా అమలు చేసి పేదల ఆర్థిక భద్రతకు భరోసా కల్పించిన అంశాన్ని గుర్తుచేశారు. ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు, అర్హులకు నివేసన స్థలాలు, నాడు-నేడుతో అభివృద్ధి కార్యక్రమాలతో దూసుకుపోతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన స్వర్ణయుగాన్ని తలపిస్తోందన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఈవూరి కేశవతి, సర్పంచ్ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అభివాదం చేస్తున్న డాక్టర్ ఈవూరి గణేష్

ఉద్యోగికి సేవలతోనే గుర్తింపు

తెనాలిరూరల్: పోలీసు వృత్తి బాధ్యతాయుతమైనదని క్రమశిక్షణ, అంకిత భావంతో పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని తెనాలి త్రీటౌన్, టూటౌన్ సీఐలు సన్నిబోయిన రమేష్, అద్దంకి సుధాకర్‌లు పేర్కొన్నారు. స్టేషన్‌లో ఏఎస్‌ఐగా పనిచేసి, బుధవారం ఉద్యోగ విరమణ పొందిన వాకా రామకోటేశ్వరరావు అభినందన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సీఐ రమేష్‌బాబు మాట్లాడుతూ తనకు అప్పగించిన విధులను అంకిత భావంతో పూర్తి చేసేవారని గుర్తు చేశారు. సమయపాలనలో రాజీ పడే మనస్తత్వం కాదని విధి నిర్వహణలో ఎప్పుడూ ముందుండే వారని చెప్పారు. 40 ఏళ్లుగా పోలీసు శాఖలో ఎటువంటి అభియోగాలు లేకుండా పని చేయడం వృత్తిపై ఆయనకు ఉన్న నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. కార్యక్రమంలో త్రీటౌన్ ఎస్‌ఐలు వెంకటేశ్వరరావు, ఎన్. ప్రకాశరావు, ఏఎస్‌ఐలు దేవప్రసాద్, బి.రమేష్ బాబు, హైదర్ ఆలి, సిబ్బంది పాల్గొన్నారు.



రామకోటేశ్వరరావును అభినందిస్తున్న సీఐలు, సహచర సిబ్బంది

అభివృద్ధి పనుల పరిశీలన

- తెనాలి ప్రాంత అభివృద్ధికి కృషి
- మున్సిపల్ ఛైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: తెనాలి ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. మారీసుపేటలో గురువారం ఉదయం ఆమె పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న మురుగు కాల్వల పూడికతీత పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. మురుగు కాల్వలపై నాపరాళ్లు ఏర్పాటు చేయటం వల్ల పూడికతీత పనులు చేయలేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని చెప్పారు. మురుగు కాల్వలు బాగు చేసేందుకు అనువుగా వాటిని ఉంచాలని సూచించారు. ఆమె వెంట కౌన్సిలర్ తోట రఘురామ్, ఆరోగ్యాధికారిణి డాక్టర్ హెలెన్ నిర్మల, వైఎస్సార్‌సీపీ నాయకులు తాడిబోయిన రమేష్ తదితరులున్నారు.



పుడికతీత పనులు పరిశీలిస్తున్న ఛైర్‌పర్సన్ రాధిక

కొల్లూరు ఎస్ఐగా రవీంద్రరెడ్డి



కొల్లూరు : కొల్లూరు ఎస్ఐగా రవీంద్రరెడ్డిని నియమిస్తూ పోలీసు ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో కొల్లూరు ఎస్ఐగా పనిచేసిన ఎస్ఐ జి.రాజ్యలక్ష్మిని వీఆర్‌కు తరలించారు. ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు అందుకున్న రవీంద్రరెడ్డి శుక్రవారం కొల్లూరు పోలీసు స్టేషన్‌లో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించనున్నారు.

రైల్వే సమస్యలపై చర్చించాలి

రేపల్లె రూరల్: పార్లమెంట్‌లో నిర్వహిస్తున్న మధ్యంతర బడ్జెట్ సమావేశాలలో తీరంలోని రైల్వే సమస్యలపై పాత గుంటూరు జిల్లాకు చెందిన పార్లమెంట్ సభ్యులు పార్లమెంట్ దృష్టికి తీసుకెళ్లాలని పట్టణాభివృద్ధి సంఘ కార్యదర్శి సీవీ మోహనరావు కోరారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. గుంటూరు డివిజన్ నుంచి సికింద్రాబాద్‌కు ప్రతి రోజు నడిచే ఐదు ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఏ ఒక్క సర్వీసుకు లింగంపల్లి టెర్మినల్‌గా లేదన్నారు. తీరప్రాంత గ్రామాలలోని తెనాలి, రేపల్లె, అవనిగడ్డ, చల్లపల్లి ప్రాంతాలతో పాటు గుంటూరు, సత్తెనపల్లి, పెదకూరపాడు ప్రాంతాల నుంచి నిత్యం ఉద్యోగ, వ్యాపార రీత్యా లింగంపల్లికి వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారని, లింగంపల్లికి టెరిమ్నల్ ఏర్పాటు చేయాలని కోరారు. పలు రకాలైన రైల్వే సమస్యలను మధ్యంతర బడ్జెట్ సమావేశాల దృష్టికి తీసుకువెళ్లటం ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

మోడల్ పేపర్ పుస్తకాల పంపిణీ

ఆలపాడు(వేమూరు): పదో తరగతి విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులు సాధించాలని తన్నీరు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు తన్నీరు శివ శంకర్ తెలిపారు. చుండూరు మండలం ఆలపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు గురువారం పదో తరగతి పరీక్షల మోడల్ పేపర్ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వరలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'మిరాకిల్' జ్యూరీ మెంబర్‌గా రత్నాకర్


తెనాలి: మిరాకిల్ వరల్డ్ రికార్డ్స్ జ్యూరీ మెంబర్‌గా తెనాలికి చెందిన కనపర్తి రత్నాకర్ నియమితులయ్యారు. గతంలో మ్యాన్ ఆఫ్ ది మిరాకిల్, ఆంధ్రావాలా బిరుదులు పొందిన రత్నాకర్‌ను జ్యూరీ మెంబర్‌గా నియమిస్తూ జాతీయ కోఆర్డినేటర్ డాక్టర్ తిమ్మిరి రవీంద్ర గురువారం నియామక పత్రాన్ని పంపారు. సహజకవి డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, డాక్టర్ కనపర్తి అబ్రహాం లింకన్, దేవిశెట్టి కృష్ణారావు, పట్టణ రంగస్థల కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి గరికపాటి సుబ్బారావు, అభ్యుదయ కళాసమితి వ్యవస్థాపకుడు బొల్లిముంత కృష్ణ తదితరులు రత్నాకర్‌ను అభినందించారు.

వైభవంగా వేంకటేశ్వర సప్తాహ వైభోత్సవాలు



తెనాలిటౌన్: పట్టణ హైస్కూల్ గ్రౌండ్‌లో శ్రీ విద్యాపీఠం, సాలిగ్రామ మఠం సంయుక్త ఆధ్వర్యంలో వెంకటేశ్వర సప్తాహ వైభోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. పూజ్య శ్రీ బాల స్వామిజీ పర్యవేక్షణలో నాలుగోరోజు స్వామివారికి 450 కిలోల పులిహోరతో అన్నకూటి ఉత్సవం, తిరుప్పావడ సేవ జరిపారు. శ్రీవారికి సుప్రభాతసేవ, తోమాలసేవ, కొలువు అర్చన, బాలభోగం, నవనీత హారతి, దివ్య ప్రబంధాలను వేదపండితులు జరిపారు. అన్నమాచార్య కీర్తనలు, టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు మహిళలు రెండు వేల మందితో కీర్తనలు ఆలపించారు. అన్నకూటి ఉత్సవంలో భాగంగా స్వామివారు బద్రినారాయణ స్వరూపంలో దర్శనమిచ్చారు. హైదరాబాద్ లలితపీఠం నిర్వాహకులు పూజ్యశ్రీ సంపూర్ణానంద గిరి స్వామి శ్రీనివాసుని విశిష్టతను భక్తులకు వివరించారు. రామాయణం విశిష్టతను చిదంబరశాస్త్రి తెలియజేశారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



తెనాలిరూరల్: తెనాలి రైల్వేస్టేషన్ ఒకటో నంబరు ప్లాట్‌ఫాంపై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ప్లాట్‌ఫాం మీద మృతదేహం ఉందన్న సమాచారంతో జీఆర్పీ పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. సుమారు 55 ఏళ్ల వ్యక్తి మృతి చెందిపడి ఉన్నాడు. గుండెపోటుతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొత్త ఎంపీడీవోల బాధ్యతల స్వీకారం



శ్రీనివాసులురెడ్డి



శేషగిరిరావు



కె.నేతాజీ



దేవసేన కుమారి



బీఎం.లక్ష్మీకుమారి



ఎంపీడీవో మల్లికార్జునరావును సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

భట్టిప్రోలు: భట్టిప్రోలు ఎంపీడీవోగా జేవీబీ మల్లికార్జునరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రకాశం జిల్లా కనిగిరి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ప్రస్తుతం భట్టిప్రోలులో పని చేస్తున్న ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు కృష్ణాజిల్లా మొవ్వ కు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన మల్లికార్జునరావును ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, సూపరింటెండెంట్ సీహెచ్ జలజ, ఈవోపీఆర్డీ టి.ఊహారాణి, సిబ్బంది అభినందనలు తెలిపారు.

రేపల్లె ఎంపీడీవోగా శ్రీనివాసులురెడ్డి

రేపల్లెరూరల్: రేపల్లె మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా కె.శ్రీనివాసులురెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల సాధారణ బదిలీల్లో భాగంగా ప్రకాశం జిల్లా పెదచెర్లోపల్లి ఎంపీడీవోగా విధులు నిర్వర్తిస్తూ ఇక్కడికి వచ్చారు. రేపల్లె ఎంపీడీవోగా విధులు నిర్వర్తిస్తున్న శివపార్వతి కృష్ణజిల్లా వీరులపాడుకు బదిలీ అయ్యారు. శ్రీనివాసరెడ్డికి కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

వేమూరు ఎంపీడీవోగా శేషగిరిరావు

వేమూరు: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా జీయస్‌వీ శేషగిరిరావు బాధ్యతలు చేపట్టారు.గతంలో ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జి బాధ్యతలను కార్యాలయ ఉద్యోగి అనురాధకు అప్పగించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఎంపీడీవోలను బదిలీ చేసింది. దీనిలో భాగంగా కృష్ణా జిల్లా ఉంగుటూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పని చేస్తున్న శేషగిరిరావును ఇక్కడికి బదిలీ చేయడంతో గురువారం బాధ్యతలు చేపట్టారు.

కర్లపాలెం ఎంపీడీవోగా నేతాజీ

కర్లపాలెం: కర్లపాలెం ఎంపీడీవోగా కె.నేతాజీ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని చీరాల ఎంపీడీవోగా పనిచేస్తూ బదిలీపై కర్లపాలెం వచ్చారు. ఇప్పటి వరకు కర్లపాలెం ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న దాసరి రాంబాబు కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలానికి బదిలీ అయ్యారు. కొత్త ఎంపీడీవోను ఈవోపీఆర్డీ ఎలీషాబాబు, మండల పరిషత్ సిబ్బంది, పలువురు గ్రామ పంచాయతీ కార్యదర్శులు మర్యాద పూర్వకంగా కలిశారు.

నిజాంపట్నం ఎంపీడీవోగా దేవసేన

నిజాంపట్నం: నిజాంపట్నం ఎంపీడీవోగా ఆర్.దేవసేన కుమారి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె అద్దంకి మండల ఎంపీడీవోగా పని చేస్తూ బదిలీపై నిజాంపట్నం ఎంపీడీవోగా వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో ఎన్.నాగలక్ష్మి కృష్ణా జిల్లా చల్లపల్లి మండలానికి బదిలీపై వెళ్లారు.

కొల్లూరు ఎంపీడీఓగా లక్ష్మీకుమారి

కొల్లూరు : కొల్లూరు నూతన ఎంపీడీఓగా బీఎం. లక్ష్మీ కుమారి ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గురువారం కొల్లూరు మండలపరిషత్తు కార్యాలయంలో ఆమె విధులను చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న ఐ. సత్యనారాయణరావు కృష్ణా జిల్లా తోట్లవల్లూరు ఎంపీడీఓగా బదిలీ అయ్యారు.

ఎంపీడీవోగా స్వరూప రాణి

అమర్తలూరు(వేమూరు): అమర్తలూరు ఎంపీడీవోగా స్వరూప రాణి బాధ్యతలు చేపట్టారు. ప్రకాశం జిల్లా చినగంజాం మండలం నుంచి స్వరూప రాణి బదిలీపై అమర్తలూరు వచ్చారు. అమర్తలూరు ఎంపీడీవోగా పని చేసిన సుభాని కృష్ణా జిల్లా పమిడి ముక్కల మండల పరిషత్ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

సేవలతోనే ఉద్యోగి జీవితం సార్థకం

ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: పోలీస్ శాఖలో విశేష కృషిచేసి పదవీ విరమణ పొందిన విశ్రాంత ఉద్యోగులకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. గురువారం పదవీ విరమణ చేసిన ముగ్గురు సిబ్బందిని జిల్లా ఎస్పీ కార్యాలయంలో సన్మానించారు. సీఐగా విధులు చేపట్టిన కె.మహాలక్ష్మి, చీరాల ట్రాఫిక్ ఎస్ఐ డి.సోలోమాన్ రాజు, కారంచేడు ఏఎస్ఐ పి.శ్యామ్‌సుందర్‌లు పదవీ విరమణ చేశారు. వీరంతా సుదీర్ఘకాలం పాటు పోలీసు శాఖలో సేవలందించారు. వీరిని ఎస్పీ సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి. మహేష్, ఏఆర్ డీఎస్పీ ఎమ్‌డిహెచ్ ప్రేమ్ కుమార్, ఎస్‌బి సీఐ వి.మల్లికార్జున, వెల్ఫేర్ ఆర్ఐ బి.శ్రీకాంత్ నాయక్ , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పదవీ విరమణ చేసిన సిబ్బందిని సన్మానిస్తున్న ఎస్పీ

దామాషా ప్రాతిపదికన ముస్లింలకు సీట్లు కేటాయించాలి

పిట్టలవానిపాలెం: దామాషా ప్రకారం ముస్లింలకు రాష్ట్రంలో నాలుగు పార్లమెంట్ స్థానాలు, 15 అసెంబ్లీ స్థానాలను కేటాయించాలని ముస్లిం ఐక్యవేదిక బాపట్ల జిల్లా అధ్యక్షుడు షేక్ మౌలా బేగ్ డిమాండ్ చేశారు.మండలంలోని చందోలులో ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం ముస్లిం జోడో యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 7 నుంచి రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాజకీయ చైతన్యం కల్పిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 12 జిల్లాల్లో జోడో యాత్ర పూర్తయిందని తెలిపారు. బాపట్ల జిల్లాలో తప్పని సరిగా ఒక అసెంబ్లీ స్థానాన్ని కేటాయించాలని కోరారు.ఈ కార్యక్రమంమలో ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర ప్రతినిధి ఖలీల్ సయ్యద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బాజి, రాష్ట్ర ఉప కార్యదర్శి సయ్యద్ నూరు, జిల్లా అధికార ప్రతినిధి జిలాని, నియోజకవర్గ అధ్యక్షులు తాజ్, ఉపాధ్యక్షులు హుస్సేన్ బేగ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముస్లిం ఐక్యవేదిక నాయకులు